సాక్షి ప్రకాశం

బుధవారం । 13 । మార్చి । 2024



ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

లంచం తీసుకుంటూ పుల్లలచెరువు పంచాయతీ కార్యదర్శి బాలునాయక్ మంగళవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. - 8లో..



విద్యాభివృద్ధికి పెద్దపీట

నాడు–నేడులో భాగంగా జిల్లాలో రూ.431 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దారని ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 33/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

రంజాన్ వేళలు

బుధవారం - ఇఫ్తార్ : సా॥ 6.25

గురువారం - సహరీ : ఉ॥ 4.58



న్యూస్‌రీల్

పెద్దిరెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేత

ఒంగోలు: జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్‌రెడ్డిపై గతంలో విధించిన సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు ఆపార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ అధ్యక్షుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని తెలిపింది.

వైద్య, నర్సింగ్ విద్యార్థులకు జపనీస్ భాషపై శిక్షణ

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇండో జపనీస్ (నావీస్–హెచ్.ఆర్) సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలో వైద్య విద్యార్థులకు జపనీస్ భాషపై ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జే రవితేజ యాదవ్ తెలిపారు. ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, ఎమ్మెస్సీ నర్సింగ్ చివరి సంవత్సరం చదువుతున్న, కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు జపనీస్ భాష నేర్పించి, జపాన్‌లో దేశంలో నర్సింగ్ సేవలు అందించేందుకు అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. 20 సంవత్సరాల నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలన్నారు. శిక్షణకు సంబంధించి రూ.3.5 లక్షలు అభ్యర్థులు చెల్లించాలని, శిక్షణ బెంగళూరులో ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు skilluniverse.apssdc.in వెబ్ సైట్‌ను సంప్రదించి వారి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 9988853335, 9550012745లను సంప్రదించాలని కోరారు.

బాబు ష్యూరిటీ..
సీటుకు లేదు గ్యారంటీ..!

తెలుగుదేశం పార్టీ 'జయహో బీసీ' అంటూ గుంటూరులో ఆర్భాటంగా సమావేశం నిర్వహించింది. బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగటమే లక్ష్యం అంటూ డిక్లరేషన్ ప్రకటించింది. ఇది కేవలం ప్రకటనలకే పరిమితం. వాస్తవం ఇందుకు భిన్నంగా ఉంటోంది. జిల్లాకు చెందిన ఒక బీసీ సామాజికవర్గానికి చెందిన నేతకు ఎంపీ సీటు ఇస్తానని సాక్షాత్తూ చంద్రబాబే హామీ ఇచ్చారు. ఇప్పుడు డబ్బున్న బడా వ్యక్తి కళ్లెదుట కనిపించేసరికి ఆ నేతను కరివేపాకులా తీసిపడేశారు. ఇదేనా బీసీ డిక్లరేషన్ అంటూ పార్టీ కేడర్ అంతర్గతంగా మథనపడుతోంది. గతంలో మాదిగానే బీసీ నినాదం కేవలం ఎన్నికలకే పరిమితం చేస్తోంది అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.



- బీసీ నేత నూకసానికి ఎంపీ సీటు ఇస్తానని చంద్రబాబు హామీ
- తాజాగా మాగుంట వైపు బాబు చూపు
- కనీసం పేరు కూడా పరిగణలోకి తీసుకోకపోవడంపై నూకసాని అసంతృప్తి
- టీడీపీ– జనసేన ఆత్మీయ సమావేశానికీ ఆహ్వానించకుండా అవమానం
- టీడీపీలో బీసీల పట్ల కొనసాగుతున్న వివక్ష
- బీసీల ఉనికిని సహించలేకపోతున్న దామచర్ల
- పేరుకే జిల్లా అధ్యక్షుడు..పెత్తనమంతా దామచర్లదే

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీని టీడీపీ అధిష్టానం మొండిచేయి చూపింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయన పట్ల చిన్నచూపు ప్రదర్శిస్తోంది. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఆయన భావించారు. కనిగిరి, గిద్దలూరు శాసనసభా స్థానాల్లో ఏదైనా ఒక సీటు కేటాయించాలని పార్టీ అధినేత చంద్రబాబును కోరారు. అయితే అసెంబ్లీ సీటు ఇవ్వడం కుదరదని, అందుకు బదులుగా పార్లమెంటు సీటు ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. దాంతో ఒంగోలు పార్లమెంటు సీటు ఇస్తారని భావించారు. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇద్దరు బీసీలకు సీటు కేటాయించింది. కందుకూరు, కనిగిరి స్థానాల్లో బీసీలను పోటీకి దింపింది. ఆ పోటీగా టీడీపీ కూడా జిల్లాలో బీసీలకు సీటు తప్పకుండా ఇస్తారని ఆశ పెట్టుకున్నారు. ఇప్పటికే 94 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. కనీసం ఒక్క బీసీకి కూడా సీటు కేటాయించలేదు. నూకసాని పేరును అసలు పరిగణలోకి తీసుకోలేదు. రెండో విడతలో అయినా టికెట్ వస్తుందని భావించారు.

పార్టీలో చేరకుండానే మాగుంటకు సీటు ?

నూకసాని బాలాజీ ప్రస్తుతం పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఒంగోలు పార్లమెంటు సీటు ఇస్తానని చంద్రబాబు మాట ఇవ్వడంతో ఆయన పిలుపు కోసం ఎదురు చూస్తున్నారు. కానీ ఒంగోలు నుంచి టీడీపీ తరఫున తన కుమారుడు రాఘవరెడ్డి పోటీ చేయనున్నట్లు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సొంతంగా ప్రకటించుకోవడంతో నూకసాని ఖంగుతిన్నారు. ఇంకా పార్టీలో చేరని వ్యక్తి ఈ సీటు నాది అని ప్రకటించుకోవడమేమిటని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ మాగుంటకు సీటు ఇవ్వాలనుకుంటే ఆ విషయాన్ని పార్టీ అధ్యక్షుడు ప్రకటించాలి కానీ అందుకు విరుద్ధంగా మాగుంట ప్రకటించుకోవడం ఏమిటని చర్చించుకుంటున్నారు. ఇది టీడీపీ బలహీనతకు అద్దం పడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రాఘవరెడ్డి పేరును ప్రస్తావిస్తూ పార్టీ ఐవీఆర్ఎస్ సర్వే చేయడం బీసీల పట్ల టీడీపీ చిన్నచూపునకు ఇది నిదర్శనమని పార్టీ నేతలే చెబుతున్నారు.

డబ్బుల్తో వస్తే బీసీలను పక్కన పెడతారా...

ఒంగోలు పార్లమెంటు సీటు ఇస్తానంటూ హామీ ఇచ్చిన చంద్రబాబు డబ్బున్న నాయకుడు రాగానే బీసీలను పక్కన పెట్టేశారని టీడీపీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే మాగుంట అనేక పార్టీలు మారారని, కాంగ్రెస్ పార్టీ నుంచి టీడీపీలోకి అక్కడ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్‌లోకి మళ్లీ ఇప్పుడు టీడీపీలోకి మారుతున్నారని, లిక్కర్ వ్యాపారాన్ని కాపాడుకునేందుకు తరచుగా పార్టీలు మారుతున్న మాగుంటకు వచ్చీ రాగానే రెడ్ కార్పెట్ పరచడమేంటి అని విమర్శిస్తున్నారు. పార్టీని నమ్ముకున్న బీసీల కంటే పార్టీలు మారే మాగుంటలే ఎక్కువయ్యారా అని మండిపడుతున్నారు.

అడుగడుగునా అవమానాలే..

పార్లమెంట్ అధ్యక్షుడైనప్పటికీ పార్టీ సమావేశాలకు పిలవకుండా, సమావేశాల్లో పాల్గొనకుండా అడుగడుగునా అవమానిస్తోంది. ఒకవైపు బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాసులు కాదు బ్యాక్ బోన్‌లు అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారికి తగిన ప్రాధాన్యత ఇస్తుంటే , మరోవైపు వెనకబడిన తరగతులు మా వెనకాలే నడవాలి, పెత్తనం మాత్రం మా చెప్పు చేతుల్లోనే ఉండాలంటూ టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పార్టీలో సొంత సామాజిక వర్గానికి చెందిన నాయకులను ప్రోత్సహిస్తూ బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను వాడుకొని వదిలేస్తున్నాడన్న విమర్శలు వినవస్తున్నాయి. గత ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశం జరిగింది. ఎంతో కీలకమైన ఈ సమావేశంలో అటు టీడీపీ నాయకులు, ఇటు జనసేన నాయకులు హాజరయ్యారు. అయితే ఈ సమావేశానికి పార్టీ పార్లమెంటు అధ్యక్షుడైన నూకసానికి పిలుపులేదు. కనీస మర్యాదగా సమాచారం కూడా ఇవ్వలేదని తెలిసింది. సోమవారం టీడీపీ, జనసేన నాయకులు కలిసి ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇంటికెళ్లి కలిశారు. కేవలం బీసీ అయినందునే నూకసానిని అవమానిస్తున్నారని ఆయన వర్గం విమర్శిస్తోంది. జిల్లా పార్లమెంటు అధ్యక్షుడైన నూకసాని భాగ్యనగర్‌లో జిల్లా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దామచర్ల గుంటూరు రోడ్డులో నగర కార్యాలయం పేరుతో సొంత కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. అయితే ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్ర నాయకులు జిల్లాకు వచ్చినప్పుడు జిల్లా కార్యాలయానికి రావలసి ఉంటుంది. కానీ జిల్లా కార్యాలయానికి రాష్ట్ర నాయకులను వెళ్లకుండా దామచర్ల అడ్డుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయంపై అనేక సార్లు అధినాయకుడికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. పైగా సొంత సామాజికవర్గానికే వత్తాసు పలికారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే పార్టీ కార్యక్రమాలకు సైతం నూకసానిని ఆహ్వానించడం లేదు. ఒకవైపు పార్టీని నమ్ముకున్న బీసీలకు మొండిచేయి ఇస్తూ జయహో బీసీ, బీసీ డిక్లరేషన్ అంటూ నాటకాలాడుతున్నారని బీసీ నాయకులు విమర్శిస్తున్నారు.

ఎన్నికల పర్యవేక్షణకు సెంట్రల్ కంట్రోల్ రూమ్

- పనులు పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్



సెంట్రల్ కంట్రోల్ రూము ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ కంట్రోల్ రూమును రెండు రోజుల్లో పూర్తి చేసి సిద్ధం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రకాశం భవనంలో ఏర్పాటు చేస్తున్న కంట్రోలు రూమును జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలతతో కలిసి పరిశీలించారు. కంట్రోల్ రూములో అవసరమైన టీవీలు, కంప్యూటర్లు, ప్రింటర్లు, జెరాక్స్, ఇంటర్‌నెట్, మైక్ సిస్టం, టేబుల్స్, కుర్చీలు ఇతర సదుపాయాలన్నీ పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా సజావుగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో మానిటరింగ్ చేసేలా కలెక్టరేట్‌లో సెంట్రల్ కంట్రోలు రూము ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు, టోల్ ఫ్రీ, సోషల్ మీడియా మానిటరింగ్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వార్తల మానిటరింగ్ ఇతర అంశాలను క్షుణ్ణంగా పర్యవేక్షించేలా కంట్రోలు రూములో పలు శాఖల నుంచి అధికారులు, సిబ్బందిని నియమించడంతో పాటు వారికి అవసరమైన శిక్షణ కూడా ఇస్తారన్నారు. పోల్‌డే రోజు వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణకు అవసరమైన ఏర్పాట్లతో పాటు ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేసేలా కంట్రోలు రూమును పక్కాగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కలెక్టర్‌తో పాటు వివిధ కమిటీల నోడల్ అధికారులు జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ, మెప్మా, హౌసింగ్, ఐసీడీఎస్ పీడీలు వసుంధర, రవికుమార్, పేరయ్య, మాధురి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, డీటీసీ సుశీల, ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

మన పార్టీ బలం..బలగం మీరే



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, కనకారావు మాదిగ, మీనా వెంకట్రావు తదితరులు



పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి తదితరులు

- అందరి అభిమానంతో 13 ఏళ్లలోనే పార్టీని బలీయం చేసుకున్నాం
- అట్టడుగు వర్గాలకు న్యాయం... జగనన్న పాలనలోనే సాధ్యం
- ప్రతి పేదింటిలో సంతోషం వెల్లివిరియాలంటే అందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషిచేయాలి
- రానున్న 50 రోజుల్లో మనం చేసే కృషే రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుంది
- వైనాట్ 175 నినాదాన్ని నిజం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి
- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: మన పార్టీ బలం...బలగం నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, బడుగు బలహీనవర్గాల ప్రజానీకమే అని స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డితో కలిసి పార్టీ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. అనంతరం వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ పార్టీ ప్రారంభించి 13 ఏళ్లు పూర్తిచేసుకుని 14వ ఏటలోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉందన్నారు. ప్రారంభించినప్పటి నుంచి అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేశామన్నారు. అందులో భాగంగానే ప్రజలు మన పార్టీకి రాష్ట్ర చరిత్రలో తిరుగులేని మెజార్టీని కట్టబెట్టారని, ప్రజావిశ్వాసాన్ని చూరగొంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల పేదలకు ఆర్థిక ప్రయోజనాలు అందిస్తూ ప్రతి ఒక్కరి కుటుంబంలో చిరునవ్వులు చూస్తున్నారని చెప్పారు. అటువంటి ముఖ్యమంత్రిని మళ్లీ గెలిపించుకుంటేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపునకు ప్రజామోదం లభించేలా ప్రతి ఒక్క ఓటరును చైతన్య పరిచి 175/175 అసెంబ్లీ, 25/25 పార్లమెంట్ స్థానాల్లో విజయకేతనం ఎగురవేసేందుకు సిద్ధం కావాలన్నారు. జిల్లాలో 8 అసెంబ్లీ, 1 పార్లమెంట్ స్థానాన్ని సైతం వాసన్న నాయకత్వంలో గెలుచుకుని జగనన్నకు కానుకగా ఇచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ సింగరాజు మీనాకుమారి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, చాత్తాడ శ్రీవైష్ణవ, మేదర కార్పొరేషన్ చైర్మన్లు టి.మనోజ్‌కుమార్, కేతా లలిత నాంచారమ్మ, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్, జిల్లా, నగర అధ్యక్షుడు బడుగు ఇందిర, తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి అరుణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లీలా కుమారి, జిల్లా ఉపాధ్యక్షుడు బాలిశెట్టి నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జులు బొమ్మినేని మురళి, గంటా రామానాయుడు, అద్దంకి నియోజకవర్గ పరిశీలకులు మారం వెంకారెడ్డి, ఆగ్రోస్ కార్పొరేషన్ డైరెక్టర్ పురిణి ప్రభావతి, సాహిత్య అకాడమీ డైరెక్టర్ బొప్పరాజు జ్యోతి, నాయీబ్రాహ్మణ, కృష్ణబలిజ, భట్రాజు కార్పొరేషన్ల డైరెక్టర్లు ధరణికోట లక్ష్మీనారాయణ, తిర్లిక శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు, ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాస్వామిరెడ్డి, ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షులు గోవర్ధన్‌రెడ్డి, సేవాదళ్ నగర అధ్యక్షులు వల్లెపు మురళి, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ జిల్లెళ్ల మూడి రమాదేవి, జగనన్న ఫౌండేషన్ అధ్యక్షులు వారా వీర్రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు గంధం సామేలు, బేతపూడి రాజేశ్వరి, బత్తుల మరియమ్మ, ప్రమీల, బెల్లంకొండ అశోక్, జి.వెంకారెడ్డి, రాయని వెంకట్రావు, దుగ్గిరెడ్డి ఆంజనేయరెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుతారం శ్రీనివాసులు, ఎస్టీ సెల్ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు భాండావత్ మంజుల, సన్నపురెడ్డి రవణమ్మ, దామరాజు క్రాంతికుమార్, గొర్రెపాటి శ్రీనివాసరావు, భవనం శ్రీనివాసరెడ్డి, పల్లా అనూరాధ, మల్లీశ్వరి, మీరా కుమారి, రావులపల్లి ధనలక్ష్మి యాదవ్, ఎస్‌కె మీరావలి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి అండగా దళితులు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టేందుకు టీడీపీ యత్నం
- గుడ్డకాల్చి మొహం పై వేయటమే టీడీపీ లక్ష్యం
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగు ఆరోపణ

సింగరాయకొండ(మర్రిపూడి): వైఎస్సార్‌సీపీకి అండగా దళితులైన మాల, మాదిగ సామాజిక వర్గాలు ఉన్నాయని, ఎవరు ఎన్ని చిచ్చులు పెట్టినా వారి ఆటలు సాగవని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగు నాగార్జున ధీమా వ్యక్తం చేశారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని గంజి వారి కళ్యాణ మండపంలో మంగళవారం మధ్యాహ్నం కొప్పోలు ఏడుకొండలు అధ్యక్షతన దళిత ఆత్మీయ సమావేశంలో మంత్రి మేరుగు నాగార్జున, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ ఇటీవల కాలంలో టీడీపీ వారు కుట్రలు, కుతంత్రాలతో దళితులైన మాల, మాదిగ సామాజిక వర్గాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, గుడ్డ కాల్చి మొహం పై వేయటమే వారి విధానమని తీవ్ర ఆరోపణలు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్, వైఎస్ రాజశేఖరరెడ్డి వంటి ముఖ్య నాయకులు దళితుల సంక్షేమం కోసం వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచేందుకు కృషి చేశారని కొనియాడారు. దళితుల సంక్షేమమే లక్ష్యంగా అంబేడ్కర్ విధానాలను పాలనాపరంగా ప్రజలకు అందజేసిన ఘనత వైఎస్సార్‌కు దక్కుతుందని కొనియాడారు. ఆయన కుమారుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు కులాలు, పార్టీలకు అతీతంగా కృషి చేశారని ప్రశంసించారు. చంద్రబాబు నాయుడు దళిత సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. టీడీపీ పాలనలో దళితులపై దాడులు, అఘాయిత్యాలు జరిగాయని ఆరోపించారు. టీడీపీ పాలనలో పేదరికం 12 శాతం ఉంటే జగనన్న పాలనలో 5 శాతం మాత్రమే ఉందన్నారు. కొండపి నియోజకవర్గంలో ఇప్పటి వరకు కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీలు మాల సామాజికవర్గానికి టికెట్ ఇస్తే మొట్టమొదటి సారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అమలు చేసిన సంక్షేమ పథకాల భరోసాతో మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రి ఆదిమూలపు సురేష్‌కు టికెట్ ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీలో మాల, మాదిగలు రెండు కళ్లు అని అన్నారు. వైఎస్సార్ సీపీలో దళితులకు సంబంధించి ఏ సమస్య వచ్చినా మాలల ప్రతినిధిగా నేను, మాదిగల ప్రతినిధిగా ఆదిమూలపు సురేష్ కలిసి నిర్ణయం తీసుకుంటామని మాల, మాదిగల ఐక్యతే మా సిద్ధాంతమని వివరించారు. రాబోయే ఎన్నికల్లో మంత్రి సురేష్ అఖండ మెజారిటీతో గెలవటం ఖాయమని, ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా కొండపిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురుతుందని మంత్రి నాగార్జున ధీమా వ్యక్తం చేశారు.

మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానని తాను ఎప్పుడూ మాల, మాదిగలను వేరుగా చూడలేదని, అందరినీ సమాన భావంతో చూశానన్నారు. కొండపి లో తన గెలుపు ఖాయమవటంతో అది ఓర్చుకోలేని టీడీపీ వారు తాను మాదిగను అని మాల, మాదిగ వర్గాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎక్కడ గెలుపొందినా ఆ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని.. ఇప్పుడు ఇన్‌చార్జి గా మూడు నెలల సమయంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశానని చెప్పారు. గతంలో కొండపిలో మాల సామాజిక వర్గానికి టికెట్ ఇచ్చారని, అప్పుడు మాదిగలు అండగా నిలిచారని, ఈసారి నాకు టికెట్ ఇవ్వటంతో మాల సామాజిక వర్గం అండగా ఉందన్నారు. గతంలో సంతనూతలపాడులో పోటీ చేసినప్పుడు ఇదేవిధంగా మాల, మాదిగల మధ్య విభేదాలు సృష్టించటానికి చూశారని, కానీ ఆ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిచానన్నారు. ప్రతిపక్షాల కుట్ర రాజకీయాలను తిప్పి కొట్టాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి అంబేడ్కర్‌ను కనుమరుగు అయ్యేలా బీజేపీ కుట్రపన్నుతోందని, ఆ పార్టీతో టీడీపీ పొత్తు పెట్టుకుందని విమర్శించారు. కులాల మధ్య చిచ్చు పెట్టడమే టీడీపీ ఆలోచనా విధానమని విమర్శించారు. రాజ్యసభలో దళితునికి అవకాశం ఇచ్చిన ఘనత జగనన్నదేనన్నారు. తన మంత్రివర్గంలో దళితులకు ప్రధాన శాఖలు ఇచ్చారని, గతంలో ఎన్నడూ ఈ విధంగా ఏ పార్టీవారు ఇవ్వలేదన్నారు. టీడీపీ విషప్రచారాన్ని తిప్పికొడుతూ మాలమాదిగ ఐక్యత కొనసాగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి సురేష్ సూచించారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ కే మాధవరావు, జెడ్పీటీసీ మన్నం అరుణకుమారి, ఎంపీటీసీ ఏపూరి శ్రీనివాసులు, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చుక్కా కిరణ్‌కుమార్, రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి రాపూరి ప్రభావతి, సీ వినోద్, ఆదిపోగు దత్తు, గండి జోసెఫ్, వీ పవన్, ఎన్ విజయరామరాజు, దేవరపల్లి అరుణ్, అశోక్, జీ మరియాదాస్, అంకయ్య, శైలజ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల వ్యక్తిత్వాన్ని కించపరచడం దారుణం

- గీతాంజలి మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి
- ఎమ్మెల్యే బాలినేని సతీమణి శచీదేవి

ఒంగోలు: మహిళల హక్కులకు భంగం కలిగేలా, వారి వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ ట్రోల్ చేయడాన్ని సభ్య సమాజంలోని ప్రతి ఒక్కరూ ఖండించాలని స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి స్థానిక చర్చిసెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి హెచ్‌సీఎం సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు గీతాంజలి మరణానికి నివాళి అర్పిస్తూ వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసిన కొవ్వొత్తుల ప్రదర్శనలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శచీదేవి మాట్లాడుతూ గీతాంజలి అమాయకంగా మాట్లాడిన తీరు ఆమె భావ వ్యక్తీకరణకు నిదర్శనం అని, అయితే ఆమెను ట్రోల్ చేస్తూ చేసిన పోస్టింగ్‌లు తనను తీవ్రంగా కలచివేశాయన్నారు. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండాలంటే పోస్టింగ్‌లు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాలినేని ప్రణీత్‌రెడ్డి సతీమణి శ్రీకావ్య మాట్లాడుతూ మహిళలు రాజకీయాల్లో రాణించాలన్నా, సమాజంలో ధైర్యంగా జీవించాలన్నా అందుకు సమాజం నుంచి సహకారం అవసరం అన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి మాట్లాడుతూ తెనాలికి చెందిన గీతాంజలి తనకు ఇంటిపట్టా రావడంతో ఆ ఆనందాన్ని మీడియాతో పంచుకుంటే ఇంత దారుణంగా ఆమెను అవమానించడం సరికాదన్నారు. ఐటీడీపీ, జనసేన సామాజిక మాధ్యమ కార్యకర్తలు చేసిన ట్రోలింగ్స్ వల్లే ఆమె మరణించిందని, అందుకు కారకులైన సజ్జా అజయ్‌తోపాటు మిగిలిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఘటనపై తక్షణ చర్యలకు అధికారులను ఆదేశించడంతోపాటు కుటుంబానికి రూ.20 లక్షలు ఆర్థిక సాయం చేయడంతో పాటు చిన్నారుల సంరక్షణ బాధ్యతను కూడా ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారన్నారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి మాట్లాడుతూ మహిళల వ్యక్తిత్వాన్ని హననం చేసేలా పోస్టింగ్‌లు పెట్టడం ఎంతవరకు న్యాయం అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, నగర అధ్యక్షురాలు చింతగుంట్ల సువర్ణ, పురిణి ప్రభావతి, లీలా కుమారి, ప్రమీల, పల్లా అనూరాధ పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న బాలినేని శచీదేవి, వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు, కార్యకర్తలు

క్లుప్తంగా

2 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం


సీజ్ చేసిన రేషన్ బియ్యం ఆటోతో అధికారులు

పెద్దారవీడు: అక్రమంగా తరలిస్తున్న 2 టన్నులకు పైగా రేషన్ బియ్యాన్ని జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన పెద్దారవీడు మండలంలో తోకపల్లి సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. విజిలెన్స్ ఏఎస్పీ బి.భవానిశ్రీహర్ష ఆదేశాల మేరకు ఆ శాఖ అధికారులు తోకపల్లి సమీపంలో సుంకేసుల పునరావాస కేంద్రం వద్ద ట్రాలీ ఆటోను తనిఖీ చేశారు. 50 ప్లాస్టిక్ సంచుల్లో ఉన్న సుమారు 2,120 కేజీల రేషన్ బియ్యంతోపాటు ఆటోను సీజ్ చేశారు. ఆటోను స్థానిక పోలీసులకు అప్పగించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ ఈడీటీ చంద్రశేఖర్, విజిలెన్స్ సీఐ రాఘవరావు, ఎస్సై కె.వెంగళరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి


కంభంలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


గిద్దలూరులో లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ

- వైఎస్సార్ చేయూత నిధుల పంపిణీలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్/కంభం: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని వైఎస్సార్ సీపీ గిద్దలూరు సమన్వయకర్త, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ చేయూత 4వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాలను గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాలకు సంబంధించి గిద్దలూరు పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో, అలాగే కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాలకు సంబంధించి కంభం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. గిద్దలూరు కార్యక్రమంలో మూడు మండలాలకు చెందిన 7105 మంది మహిళలకు రూ.13.32 కోట్లు, కంభం కార్యక్రమంలో మూడు మండలాలకు చెందిన ==== మహిళలకు === చెక్కు పంపిణీ చేశారు. ముందుగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అలాగే గిద్దలూరు ఏడుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. వైఎస్సార్ చేయూత ద్వారా జగనన్న ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తోందన్నారు. మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమ ప్రకాశం వరప్రదాయని వెలిగొండ ప్రాజెక్టును జగనన్న పూర్తి చేశారని, వాటర్ గ్రిడ్, మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల దురాగతాలను గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. గిద్దలూరు కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, ఎంపీపీ కడప లక్ష్మి, కమిషనర్ వి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ హేమలత, పార్టీ మండల కన్వీనర్ పూలి రామకృష్ణారెడ్డి, సచివాలయం కన్వీనర్ ఓబులరావు, వైస్ చైర్మన్ కాతా దీపికా, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకుడు బాదం గోపాల్, సీఆర్ఐ మురళి, కొమరోలు జెడ్పీటీసీ వెంకటనాయుడు, కావేటి ఈశ్వర్‌నాయుడు, కంభం కార్యక్రమంలో కంభం, బేస్తవారిపేట ఎంపీపీలు చేగిరెడ్డి తులశమ్మ, వేగినాటి ఓసురారెడ్డి, అర్ధవీడు, బేస్తవారిపేట జెడ్పీటీసీలు చెన్ను విజయ, బండ్లమూడి రాజయ్య, పార్టీ నేతలు ఏలం వెంకటేశ్వర్లు, డిష్ మున్నా, ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

- జిల్లాలో రూ.431 కోట్లతో పాఠశాలల అభివృద్ధి
- ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్


ముండ్లమూరు ఏపీ మోడల్ స్కూలులో విద్యార్థులతో మాట్లాడుతున్న యనమల నాగార్జున యాదవ్

ఒంగోలు/ముండ్లమూరు: నాడు-నేడులో భాగంగా జిల్లాలో రూ.431 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని, పాఠశాలలు భేషుగ్గా ఉన్నాయని రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతులు సదుపాయాల కల్పనా సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ అన్నారు. మంగళవారం ఒంగోలు వచ్చిన ఆయన పలు పాఠశాలలను పరిశీలించారు. తరగతి గదులను, డిజిటల్ క్లాస్ రూంలు, మౌలిక సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని ముండ్లమూరు ఏపీ మోడల్ పాఠశాల, గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నగరంలోని బండ్లమిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సింగరాయకొండ ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. 10 రకాలైన మౌలిక వసతులు తప్పకుండా ప్రతి ప్రభుత్వ బడిలో తప్పకుండా ఉండాలనే ఒక ఉన్నతాశయంతో కోట్లు ఖర్చు చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. రాష్ట్రంలో రూ.17 వేల కోట్లుకు పైగా వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. గతంలో పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడేవారని, కానీ నేడు మా బడి ముఖచిత్రమే మారిపోయిందనే చర్చ నేడు విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తుల్లో సైతం వినిపిస్తుందన్నారు. మరుగుదొడ్ల నుంచి ఐఎఫ్‌పీ ప్యానల్స్ వరకు ఈ ప్రభుత్వం తమను ఎంతగానో ప్రోత్సహించిందని విద్యార్థులు జగన్‌మామయ్యకు కృతజ్ఞతలు తెలియజేయడం మరుపురాని అనుభూతిగా పేర్కొన్నారు. ఆయన వెంట ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ భాస్కర్‌బాబు, డీఈ విశ్వనాథం, ఏఈ జగన్, రామమోహన్‌రావు, నాడు నేడు జిల్లా నోడల్ అధికారి టి.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పులిదాడిలో ఆవు మృతి


సీసీ కెమెరాలో నమోదైన ఆవును తింటున్న పెద్దపులి

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీ పరిధి నల్లమల అడవిలో పెద్దపులి దాడిలో ఆవు మృతి చెందగా మరో ఆవుకు తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. గుండంచర్ల పంచాయతీలో కాటంరాజుతాండకు చెందిన మేఘవత్ శ్రీరాములునాయక్ ఆవులను అడవిలో మేపుకుంటూ జీవనం సాగించేవాడు. ఆవు మృతి చెందిన విషయం అటవీశాఖ అధికారులకు శ్రీరాములునాయక్ సమాచారం అందించాడు. సంఘటన స్థలాన్ని మార్కాపురం అటవీశాఖ అధికారులు సందర్శించారు. సీసీ కెమెరాల్లో నమోదైన విధంగా ఆవులపై పెద్దపులి దాడి చేసినట్లుగా గుర్తించామని అధికారులు తెలిపారు. కొంత కాలం నుంచి అడవిలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అధికారులు వెల్లడించడంతో గ్రామస్తులు భయందోళన చెందుతున్నారు.

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి


కార్యదర్శి బాలునాయక్

పుల్లలచెరువు: లంచం తీసుకుంటూ పుల్లలచెరువు పంచాయతీ కార్యదర్శి ఆర్ బాబునాయక్ మంగళవారం ఏసీబీకి చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ వీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు పుల్లలచెరువుకు చెందిన రామావత్ ధర్మానాయక్ 2018 సంవత్సరంలో పుల్లలచెరువులో పంచాయతీ తీర్మానం ప్రకారం రూ.2 లక్షలు ఖర్చు చేసి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. దానికి సంబంధించి 2022లో రూ.లక్ష ధర్మానాయక్ కు జమ చేశారు. 2022లో ధర్మానాయక్ చనిపోవడంతో అప్పటి నుంచి మిగిలిన నగదు లక్ష రూపాయలు రావాలని అతని కుమారులు శివాజినాయక్, హరినాయక్ లు ఇద్దరూ పంచాయతీ కార్యదర్శి బాలునాయక్‌ను అడుగుతున్నారు. ఈక్రమంలో ఈనెల 3వ తేదీన ధర్మానాయక్ కుమారులకు బాలునాయక్ ఫోన్ చేసి మీకు రావాల్సిన లక్ష రూపాయలు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తానని, దానికి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. 4వ తేదీన వారు రూ.15 వేలు ఇస్తామని చెప్పి అప్పుడు రూ.5 వేలు ఇచ్చారు. మిగిలిన రూ.10 వేలు ఇవ్వాలని అడగడంతో లంచం ఇవ్వడం ఇష్టం లేని హరినాయక్, శివాజినాయక్‌లు ఈనెల 7వ తేదీన ఒంగోలు వచ్చి ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆమేరకు ఏసీబీ అధికారుల సూచనలతో మంగళవారం ఫిర్యాదుదారుడు హరినాయక్ ఎంపీడీవో కార్యాలయంలో బాలునాయక్‌ను కలిసి రూ.10 వేలు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో కేసు నమోదు చేసి అరెస్టు చేసి నెల్లూరు కోర్టుకు హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో పనిచేస్తున్న వివిధ శాఖ అధికారులపై లంచం తీసుకుంటున్నట్లుగా తమకు ఫిర్యాదు వస్తున్నాయని, ప్రజలు గమనించి తమకు 14400 కు ఫోన్ చేయాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్పీ తో పాటు సీఐలు ఎస్ఎస్ అపర్ణ, సీహెచ్ శేషు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 1645 మంది గైర్హాజరు

ఒంగోలు: జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సర భౌతిక శాస్త్రం, అర్ధ శాస్త్రం పరీక్షలకు 1645 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 21,285 మందికిగాను 20,065 మంది, ఒకేషనల్ విభాగంలో 2,655 మందికి 2,230 మంది హాజరయ్యారని ఆర్‌ఐవో సైమన్ విక్టర్ వివరించారు.

బాబు, కరువు సియామీ కవలలు


ఇంటింటి ప్రచారంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

- టీడీపీ జమానా మొత్తం రాష్ట్ర ప్రజలకు తిప్పలే..
- సంక్షేమం కొనసాగాలంటే సీఎంగా జగనన్నే మళ్లీ రావాలి
- వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: చంద్రబాబు, కరువు సియామీ(అవిభక్త) కవలలని, ఆయన అధికారంలోకి వచ్చినపుడల్లా కరువు తాండవిస్తుందని వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండలంలోని పోతవరం, తానంచింతల గ్రామాల్లో మంగళవారం 'మన ఊరు మన శివన్న' కార్యక్రమం నిర్వహించారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మకు స్థానిక నాయకులు, మహిళలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారంలో ఉన్న 14 ఏళ్లలో రాష్ట్రానికి కరువును తీసుకురావడం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. 2019లో సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చినపటి నుంచి సకాలంలో వర్షాలు కురిశాయన్నారు. సాగర్ జలాలు సకాలంలో అందాయని, పంటలు కూడా బాగా పండాయన్నారు. ఎన్నికలు దగ్గరకు రావడంతో చంద్రబాబు మళ్లీ రాష్ట్రంలోకి అడుగుపెట్టాడని, పడే వర్షాలు కూడా ఆగిపోయాయని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాకే రైతులందరూ సుభిక్షంగా ఉన్నారని చెప్పారు. గ్రామ సచివాలయాలు అభివృద్ధికి చిహ్నాలుగా నిలిచాయన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే అని స్పష్ట ం చేశారు. సంక్షేమం కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి రావాలని స్పష్టం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా అధికారంలో ఉన్నా లేకున్నా బూచేపల్లి కుటుంబం ప్రజా సేవకు అంకితమైందన్నారు. తన కుమారుడు దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తానంచింతలలో లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఎం బాషా, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, గ్రామ సర్పంచ్ దివ్య, ఎంపీటీసీ బి.సుబ్బులు, సాగర్ ప్రాజెక్టు మాజీ వైస్ చైర్మన్ సద్ది పుల్లారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కేవీ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు సూరే సుబ్బారావు, విద్యార్థి విభాగం కార్యదర్శి నారాయణరెడ్డి, రంగసాయి, ఏడుకొండలు, చిన్నబాబు, రంగబాబు, నాగార్జున, ఆదాం, యోగేశ్వరరావు, సుబ్బారావు, శ్రీను, వెంకటేశ్వర్లు, నరసయ్య, గుండారావు, లక్ష్మయ్య, వెంకన్నబాబు, మల్లికార్జున, ఎర్రగొండ వెంకయ్య, వెంకన్న, బాలయ్య, సుబ్బయ్య, అంకబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి సురేష్

- మంత్రి ఆదిమూలపు సురేష్
- 53 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

సింగరాయకొండ(మర్రిపూడి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పరిపాలన సాగిస్తున్నారని, కష్టాల్లో ఉన్న పేదలందరికీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. సింగరాయకొండ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం 5వ విడతగా 53 మందికి రూ.28.25 లక్షల చెక్కులు, ఎల్ఓసీ కింద ఒకరికి రూ.3 లక్షలు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 122 మందికి సీఎంఆర్ఎఫ్ నిధులు రూ.1.15 కోట్లు అందజేశామని పేర్కొన్నారు. కొండపి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, పల్లపోలు బాలకోటిరెడ్డి, మల్లవరపు రాఘవరెడ్డి, బత్తిన మదన మనోహర్‌రావు, కొండాబత్తిన మాధవరావు, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి రాపూరి ప్రభావతి, జేసీఎస్ కన్వీనర్లు పిల్లి తిరుపతిరెడ్డి, తాటికొండ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వెలుగొండను పూర్తి చేసిన ఘనత జగనన్నదే

- వై.పాలెం ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్


రాజుపాలెంలో ప్రభ నుంచి మాట్లాడుతున్న తాటిపర్తి

త్రిపురాంతకం: వెలుగొండ ప్రాజెక్టును గత ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తే జగనన్న ప్రభుత్వం వెలుగొండను పూర్తి చేసి ప్రారంభించారని వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం నియోజకవర్గ సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని రాజుపాలెంలో సోమవారం రాత్రి విద్యుత్ ప్రభపై నుంచి ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయుటలో విఫలమైందన్నారు. కేవలం కల్లబొల్లి మాటలతో కాలక్షేపం చేసిన ప్రభుత్వం గత ప్రభుత్వానిదైతే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందించారన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా అద్భుత పాలనను అందించి గ్రామంలోనే ప్రజలకు అన్ని రకాల సేవలు అందించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. పారదర్శకంగా పాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అందరూ మద్దతుగా నిలవాలన్నారు. ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, పార్టీ కన్వీనర్ ఎస్. పోలిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాల్‌రెడ్డి, రాజుపాలెం గ్రామానికి చెందిన నాయకులు, సచివాలయ కన్వీనర్ చల్లా యల్లారెడ్డి, ఎంపీటీసీ చల్లా జ్యోతి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అలవాల శంకర్‌రెడ్డి, సర్పంచ్ కృపావతి, వరప్రసాద్, చెన్నకేశవరెడ్డి, సరళ, వైఎస్సార్ సీపీ రంగబాబు, మల్లికార్జున్, వెంగళరెడ్డి, బాలకోటిరెడ్డి, బాలునాయక్, బాలు, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీలో 62 కుటుంబాల వారు చేరారు.